క్లుప్తంగా

ఉత్సాహంగా బాస్కెట్‌బాల్ శిక్షణ



సామర్లకోటలో బాస్కెట్ బాల్ శిక్షణ పొందుతున్న చిన్నారులు

సామర్లకోట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఈ నెల ఒకటి నుంచి చిన్నారులకు ప్రారంభించిన బాస్కెట్‌బాల్ క్యాంప్ ఉత్సాహంగా కొనసాగుతుంది. జూనియర్ కళాశాల ఆవరణలో 13 ఏళ్లుగా ఫ్రెండ్స్ అండ్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమ్మర్ బాస్కెట్‌బాల్ క్యాంప్ జరుగుతుంది. ఈ క్యాంప్‌లో శిక్షణ పొందే చిన్నారులకు ప్రతి రోజు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గుడ్లు, మజ్జిగ అరటిపండ్లను అందిస్తున్నారు. కోచ్‌లు చెక్కా నరేష్, కోటి, తాడి కల్యాణ్‌లు చిన్నారులకు శిక్షణ ఇస్తున్నారు. 70 మంది చిన్నారులు శిక్షణ బాస్కెట్ బాల్ శిక్షణ పొందుతున్నారు. ఈ మేరకు సోమవారం శిక్షణను వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా విప్పర్తి కొండలరావు మాట్లాడుతూ చిన్నారులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇంటి వద్ద టీవీ, సెల్‌ఫోన్లను పక్కన పెట్టి క్రీడలపై దృష్టి సారించాలన్నారు. వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు సైపుల్లా, కెనడీ, కుంచే శ్రీను, సత్యానందం, మణిరాజు, చిట్టిబాబు, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం



వేసవి శిక్షణ తరగతుల్లో ప్రసంగిస్తున్న నాగరాజు

పెద్దాపురం: గ్రంథాలయాల్లో పుస్తక పఠనం ద్వారా విజ్ఞానం పెరుగుతుందని గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అన్నారు. పెద్దాపురం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం పుస్తక పఠనం, కథలు చదవడం చేయించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికి తీసేందుకు ఈ శిక్షణ తరగతులు దోహదపడతాయన్నారు. అనంతరం ఉపాధ్యాయుడు రాళ్లపల్లి వెంకటేశ్వరరావు విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సింగం బుల్లియ్య తదితరులు పాల్గొన్నారు.


పవర్ లిఫ్టింగ్ పోటీల్లో విజేతకు అభినందన



నిర్వాహకుల నుంచి గోల్డ్ మెడల్, మెమెంటో, సర్టిఫికెట్ స్వీకరిస్తున్న లిఫ్టర్ జగన్

కరప: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో ఆదివారం జరిగిన 3వ యునైటెడ్ ఈస్ట్ అండ్ వెస్ట్ గోదావరి జిల్లాల పవర్ లిఫ్టింగ్ అండ్ బెంచ్ ప్రెస్ పోటీల్లో కాకినాడ తరఫున పాల్గొన్న కరప మండలం గొర్రిపూడి గ్రామానికి చెందిన మేడిశెట్టి జగన్ సత్తా చాటాడు. 66 కిలోల విభాగంలో పవర్ లిఫ్టింగ్, బెంచ్ ప్రెస్‌లో ప్రథమ స్థానంలో నిలిచి రెండింటిలో గోల్డ్ మెడల్, స్ట్రాంగ్‌మెన్ విన్నర్ (ఓవరాల్ చాంపియన్)గా నిలిచినట్టు లిఫ్టర్ జగన్ సోమవారం విలేకరులకు తెలిపారు. ఆయన్ని సానా సతీష్‌బాబు స్వచ్ఛంద సేవా సంస్థ ఫౌండర్ తలాటం హరీష్ అభినందించారు. ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, వైఎస్సార్ సీపీ కరప గ్రామ కమిటీ అధ్యక్షుడు మేడిశెట్టి సత్తిబాబు, మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు జగన్‌ను అభినందించారు.

కవితా పండగ పోస్టర్ ఆవిష్కరణ



కవితా పండగ, కవి సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జేఎన్‌టీయూకేలో వీసీ ప్రసాద్

బోట్‌క్లబ్: శ్రీశ్రీ కళావేదిక సీఈఓ కత్తిమండ ప్రతాప్ ఆధ్వర్యంలో వచ్చే నెల 22న కాకినాడ పీఆర్ కళాశాల్లో గోదావరి కవితా పండగ, కవి సమ్మేళనం నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను స్థానిక జేఎన్‌టీయూకేలో సోమవారం వీసీ సీఎస్ఆర్‌కే ప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ ప్రసాద్ మాట్లాడుతూ నిరంతరం తెలుగు భాషాభివృద్ధికి, తెలుగు సాహిత్యాభివృద్ధికి కృషి చేసిన కత్తిమండ ప్రతాప్ సేవలను ప్రశంసించారు. కళావేదిక రాష్ట్ర కార్యదర్శి అమ్మకవి కొండేపూడి తాతబ్బాయి మాట్లాడుతూ ఏ కవి దగ్గర ఒక్క రూపాయి కూడా తీసుకోకుండా వారికి కావాల్సిన వసతి, ఆహారం అందిస్తున్నట్లు చెప్పారు.

వింటారు... వదిలేస్తారు!

- పిఠాపురం పీజీఆర్ఎస్‌లో పరిస్థితి
- సమస్యలకు పరిష్కారం శూన్యం



పిఠాపురం పాడా కార్యాలయంలో అర్జీదారుల సమస్యలు వింటున్న అధికారులు

పిఠాపురం: సమస్యలు వింటారు... అర్జీలూ స్వీకరిస్తారు.. ఆనక పరిష్కారానికి మాత్రం మొండిచేయి చూపుతున్నారు.. వారం వారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక పరిస్థితి ఇది.. ప్రతి వారం ఎంతో గొప్పగా నిర్వహిస్తున్నా సమస్యలకు మాత్రం ఎక్కడా పరిష్కారం దొరకడం లేదు.. మళ్లీ అదే సమస్యలపై అధికారులకు చెప్పుకొందామని వస్తే అయినా స్పందన ఉండడం లేదు. ఇది ముందు ఇచ్చిందే కదా చూద్దాంలే వెళ్లండి అంటూ తిరిగి పంపించడం తప్ప స్పందన కానరావడం లేదు. పిఠాపురం పాడా కార్యాలయంలో వారం వారం నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చి తమ వెతలు చెబుతున్నా పరిష్కారం దొరకడం లేదని ఫిర్యాదుదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సుమారు రెండు నెలలుగా ఈ వ్యవస్థ పిఠాపురం పాడా కార్యాలయంలో పాడా పీడీ చైత్రవర్షిణి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. గ్రామాలు మున్సిపాలిటీల్లో పరిష్కారం కాని సమస్యలను జిల్లా కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే గ్రీవెన్స్‌లో ఇవ్వడం ద్వారా తమ సమస్యకు పరిష్కారం కోసం ప్రజలు చూస్తుంటారు. దాని కోసం కాకినాడ వెళ్లాల్సి రావడంతో ఫిర్యాదుదారుల ఇబ్బందులు తొలగించాలనే ఉద్దేశంతో పిఠాపురంలో కొత్తగా ఏర్పాటు చేసిన పిఠాపురం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (పాడా) కార్యాలయంలో పీజీఆర్ఎస్ పేరుతో నియోజకవర్గ స్థాయిలో గ్రీవెన్స్ నిర్వహిస్తున్నారు. ఇందులో పాడా పీడీతో పాటు నియోజకవర్గ అధికారులు అంతా హాజరవుతున్నారు. అయితే ఇక్కడ ఎక్కడా లేని వింత పోకడ అమలవుతుండడంతో అర్జీదారులు అవాక్కవుతున్నారు. సమస్యలు స్వీకరించడానికి పాడా పీడీతో పాటు మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్‌లు వేదికపై ఉండడం వారికి సంబంధించి వచ్చిన ఫిర్యాదులను వారే స్వయంగా తీసుకుంటున్నారు. అయినా తమ సమస్యలు పరిష్కరించడం లేదంటూ అర్జీదారులు మళ్లీ వెళ్లి చెబుతున్నా స్పందన కరవవుతోంది. పాడా కార్యాలయంలో పీజీఆర్ఎస్ పేరుతో గ్రీవెన్స్‌లో ఇప్పటి వరకూ 500కు పైగా అర్జీలు రాగా, వాటిలో సగానికి పైగా ఇంకా పరిష్కారానికి నోచుకోలేదు. ఇందులో ఎక్కువ పిఠాపురం మున్సిపాలిటీకి చెందిన పారిశుధ్య సమస్యలే ఉండగా, వీటిని పరిష్కరించకుండా తాత్సారం చేసే మున్సిపల్ కమిషనర్ కనకారావే మళ్లీ ఈ అర్జీలను స్వీకరించడం పట్ల అర్జీదారులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రీవెన్స్‌లో పాడా పీడీ ఉంటున్నప్పటికీ మున్సిపాలిటీకి సంబంధించిన ఫిర్యాదులు వస్తే అక్కడే వేదికపై ఉన్న కమిషనర్ కనకారావుకే ఇవ్వాలని సూచిస్తుండడం విమర్శలకు దారితీస్తోంది. ఆయనకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని, ఫిర్యాదు చేయడానికి వస్తే మళ్లీ అది కూడా ఆయనకే ఇమ్మంటున్నారని ఇక తమ సమస్య ఎలా పరిష్కారం అవుతుందని అర్జీదారులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటి వరకూ పిఠాపురం కొండప్పవీధిలో పారిశుధ్య సమస్యపై ఆ వార్డు కౌన్సిలర్‌తో సహా ప్రజలు అనేక ఫిర్యాదులు అందజేశారు. ఆ సమస్యను పాడా పీడీ సైతం స్వయంగా పరిశీలించారు. కానీ రెండు నెలలుగా పరిష్కారం కాలేదని స్థానికులు మండిపడుతున్నారు. చిన్నచిన్న సమస్యలను సైతం పట్టించుకోని స్థానిక అధికారులపై చర్యలు తీసుకుని ప్రతి సమస్యకు పరిష్కారం చూపించాలని నియోజకవర్గ ప్రజలు కోరుతున్నారు.

నాలుగు అర్జీల స్వీకరణ

పెద్దాపురం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు నాలుగు అర్జీలు వచ్చాయని పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి తెలిపారు. డివిజన్‌లో ఆయా మండలాల నుంచి వచ్చిన అర్జీలను ఆర్డీఓ స్వీకరించారు. డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖలకు బదిలీ చేసి, సమస్యను పరిష్కరిస్తామన్నారు. కార్యాలయ ఏఓ మాధవరావు, డీటీ భానుకుమార్, సీడీపీఓ ఉష తదితరులు పాల్గొన్నారు.

స్థానికులకు అవకాశం కల్పించాలి



సమావేశంలో మాట్లాడుతున్న దావీదురాజు

పెద్దాపురం: నియోజకవర్గ పరిధిలో ఉన్న పరిశ్రమల్లో స్థానికులకు 75 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించాలని జాతీయ సామాజిక న్యాయ పోరాట సమితి నాయకులు సంకు దావీదురాజు, ఆకుమర్తి సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ పార్కు ఆవరణలో సోమవారం పెద్దాపురం మండల అధ్యక్షుడు వేమగిరి ప్రసన్నకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా లబ్ధి పొందుతున్న పరిశ్రమల యాజమాన్యాలు స్థానికులకు అవకాశం కల్పించడం లేదన్నారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి పరిశ్రమల యాజమాన్యాలకు ఆదేశాలు ఇవ్వాలని కోరారు. లేకంటే కార్మికుల పక్షాన పోరాడతామని హెచ్చరించారు. సమావేశంలో మందపల్లి రుద్రయ్య, సీహెచ్ వెంకటేశ్వర్లు, కామరాజు, టి.సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన



సామర్లకోటలో అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న ఔట్ సోర్సింగ్ ఇంజినీరింగ్ కార్మికులు

సామర్లకోట: తమ న్యాయమైన కోర్కెలను తీర్చాలని సామర్లకోట మున్సిపల్ ఇంజినీరింగ్ శాఖ కాంట్రాక్టు కార్మికులు చేస్తున్న సమ్మె సోమవారంతో 20వ రోజుకు చేరుకుంది. మున్సిపల్ కార్యాలయం ఎదురుగా అర్ధనగ్న ప్రదర్శనతో వారు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 15 ఏళ్లుగా మున్సిపాలిటీ కాంట్రాక్టు కార్మికులుగా పని చేస్తున్న తమను పర్మినెంట్ చేయాలని, విధి నిర్వహణలో చనిపోతే రూ.10 లక్షలు, అంగవైకల్యం పొందితే రూ. ఐదు లక్షల నష్ట పరిహారం చెల్లించాలని, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, స్కిల్ వర్కర్లకు రూ.29,200, నాన్ స్కిల్ వర్కర్లకు రూ.24,500 వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. తమ చేతికి రూ.13 వేలు వస్తే కుటుంబాన్ని ఏవిధంగా పోషించుకోవాలని వారు ప్రశ్నించారు. సెలవులు లేకుండా విధులు నిర్వహిస్తున్నామని, ప్రభుత్వ సెలవులు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. గతంలో సమ్మె చేయగా సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చి, ఇప్పటి వరకూ పట్టించుకోకపోవడంతో ఈ నెల 7వ తేదీ నుంచి సమ్మె ప్రారంభించినట్లు కార్మిక సంఘ నాయకులు తెలిపారు.

ప్రజల పక్షాన నిలిచి పోరాడుదాం..

వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి వంగా గీత



వంగా గీతకు కృతజ్ఞతలు తెలుపుతున్న నాయకులు

పిఠాపురం: సమస్యలపై ప్రజల పక్షాన నిలిచి వైఎస్సార్ సీపీ శ్రేణులు పోరాడాలని, పార్టీలో కష్టపడే ప్రతి ఒక్కరికీ తగిన గుర్తింపు ఉంటుందని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంగా గీతా విశ్వనాథ్ అన్నారు. సోమవారం పిఠాపురం పార్టీ కార్యాలయంలో ఆమెను వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మత్స్యకార నాయకుడు కారే శ్రీనివాసరావు కలసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గీత మాట్లాడుతూ వివిధ విభాగాల్లో నిష్టాతులైన కార్యకర్తలు, నాయకులను అధ్యక్షులుగా నియమించడం ద్వారా పార్టీపై నాయకుల్లో నమ్మకం, విశ్వాసం పెంచినట్లవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ తమకు ఇచ్చిన పదవులతో నియోజకవర్గంలో పార్టీని ముందుకు నడిపించి ప్రజల్లో పార్టీ పట్ల నమ్మకాన్ని పెంచాలన్నారు. ముఖ్యంగా మత్స్యకార గ్రామాల్లో మంచి పట్టు ఉన్న నాయకుడు కారే శ్రీనివాసరావుకు పార్టీ జిల్లా స్థాయిలో పదవి ఇచ్చి ఆయనపై గురుతర బాధ్యతను ఇచ్చారన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో మత్స్యకారులకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి, వారి అభ్యున్నతికి పాటుపడ్డారన్నారు. మత్స్యకారుల చికాల కోరికైన ఉప్పాడ మేజర్ హార్బర్‌ను నిర్మించి వారి జీవన విధానం మెరుగుపడేలా చర్యలు తీసుకున్నారన్నారు. తనపై పార్టీ పెట్టిన గురుతర బాధ్యతను శక్తివంచన లేకుండా నిలబెడతానని కారే శ్రీనివాసరావు తెలిపారు. ఒక్క వైఎస్ జగన్ హయాంలోనే మత్స్యకారులకు ఎక్కువ మేలు జరిగిందని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జ్యోతుల వాణి, కొత్తపల్లి మండల పార్టీ అధ్యక్షుడు ఆనాల సుదర్శన్, వైస్ ఎంపీపీ శెట్టిబత్తిన సురేష్ కుమార్, పాలాని దొరబాబు, సుబ్బారెడ్డి, ఎలీషా, జగన్నాథం, విష్ణుమూర్తి, ప్రసాదరెడ్డి, దివాకరరెడ్డి, హరిబాబు, కంబాల ఏకోబు తదితరులు పాల్గొన్నారు.

సర్వేశ్వరా.. భీమేశ్వరా

పంచారామ క్షేత్రంలో ప్రత్యేక పూజలు



సామర్లకోటలో కుమారారామ భీమేశ్వరస్వామి

సామర్లకోట: స్థానిక పంచారామ క్షేత్రంలో కుమారారామ భీమేశ్వరస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి ప్రీతికరమైన రోజు కావడంతో ఆలయం, ఉపాలయాల్లో అర్చకులు పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. స్వామివారి తొలి అభిషేకం తిలకించడానికి క్యూలో భక్తులు బారులు తీరారు. ఆలయానికి వచ్చిన భక్తులు ఆలయ ప్రాంగణంలో ధ్వజస్తంభం వద్ద ఉన్న శివలింగానికి పాలు, ఆలయ పుష్కరిణిలో నీటితో స్వయంగా అభిషేకాలు చేశారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఉదయం పులిహోర, మధ్యాహ్న అన్నప్రసాదం, సాయంత్రం శెనగలు, పులిహోర ప్రసాదంగా పంపిణీ చేశారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లకి రాజ్‌గోపాల్‌శర్మ, సన్నిధిరాజు వెంకన్న, శ్రీకాకుళపు సత్యనారాయణ మూర్తి, వినయ్, చెరుకూరి రాంబాబులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక అలంకరణలు చేశారు.

వైభవంగా మదుగులమ్మ జాతర



హుస్సేన్‌పురంలో మదుగులమ్మ అమ్మవారు

హుస్సేన్‌పురంలో మదుగులమ్మ అమ్మవారి జాతర వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉదయం అమ్మవారికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. గ్రామంలో ప్రతి కుటుంబంలో నైవేద్యాలు పెట్టుకొని అమ్మవారిని దర్శించుకున్నారు. సాయంత్రం వివిధ సాంస్కృతిక ప్రదర్శనల మధ్య అమ్మవారి జాతర నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. కమిటీ సభ్యులు చల్లా బుజ్జి, కోట అప్పారావు, మార్ని సూర్యారావు, పుప్పాల రమణ, గిరి, యవర్ల అబ్బాయి, సత్తిబాబు, మార్ని హరి, మార్ని సురేంద్ర తదితరులు భక్తులకు సేవలందించారు. సీఐ ఎ.కృష్ణభగవాన్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఘనంగా నేరేళ్లమ్మ జాతర



కొమరగిరిలో నేరేళ్లమ్మ తల్లి

కొత్తపల్లి: మండలంలోని కొమరగిరి గ్రామ దేవత నేరేళ్లమ్మ జాతరను సోమవారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలో చిరుతాడిని గరగ నృత్యాలతో ఊరేగించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. గత 15 రోజులుగా గ్రామంలో ప్రతి రోజూ గరగ నృత్యాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం అమ్మవారి తీర్థాన్ని జరిపామన్నారు.

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం

మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య



సామర్లకోట మున్సిపల్ కార్యాలయం వద్ద యోగా శిక్షణలో కమిషనర్, చైర్‌పర్సన్

సామర్లకోట: యోగాతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య అన్నారు. యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టర్ ఆదేశాల మేరకు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన యోగా శిక్షణలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూన్ 21 వరకూ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రోజూ ఉదయం యోగా శిక్షణ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ ఉదయం, సాయంత్రం యోగాకు సమయం కేటాయించాలన్నారు. విద్యార్థులు, చిన్నారులు యోగా సాధనతో ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు. ప్రతి వార్డుకు చెందిన సచివాలయ సిబ్బందికి శిక్షణ ఇస్తామని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి మండల స్థాయి శిక్షణ

జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం ఉదయం ఏడు గంటల నుంచి 9 గంటల వరకూ మండలంలోని వివిధ శాఖల సిబ్బందికి యోగా శిక్షణ ఉంటుందని ఎంపీడీఓ కె.హిమామహేశ్వరీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్తు కార్యాలయం ఆవరణలో ఈ నెలాఖరు వరకు జరిగే యోగా శిక్షణకు పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, మండల సమాఖ్య ప్రతినిధులు హాజరు కావాలన్నారు.

తాగునీరు రాక ఇక్కట్లు



ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్న బలుసులపేట ప్రజలు

సామర్లకోట: స్థానిక బలుసులపేట, పెన్షన్‌లైన్ ప్రాంతాలకు రెండు రోజులుగా తాగునీరు రాక ప్రజలు ఇక్కట్లకు గురవుతున్నారు. దీంతో ప్రజలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. కోట్లమ్మ చెరువు వద్ద ఉన్న ట్యాంకుల నుంచి ఈ ప్రాంతాలకు తాగునీరు కుళాయిల ద్వారా సరఫరా అవుతుంది. ఉండూరు రైల్వే గేటు వద్ద ఉన్న ఫిల్టర్ ప్లాంట్ నుంచి ప్రధాన పైపులైన్ ద్వారా ఈ ట్యాంకులను నింపుతారు. ఈ ప్రధాన పైపులైన్ కోట్లమ్మ చెరువు వద్ద లీకులు ఏర్పడ్డాయి. దీంతో ట్యాంకులు నిండే అవకాశం లేక ఆయా ప్రాంతాలకు తాగునీరు అందని పరిస్థితి నెలకొంది. ఇంజినీరింగ్ సిబ్బంది లీకులకు మరమ్మతుల్లో భాగంగా పైపులైన్ ద్వారా పంపింగ్ నిలిపివేశారు. పైపులైన్ మరమ్మతులు పూర్తి కావడంతో మంగళవారం నుంచి పూర్తి స్థాయిలో తాగునీరు సరఫరా చేస్తారని ఇంజినీరింగ్ శాఖాధికారులు చెబుతున్నారు. ఈ మరమ్మతుల సమయంలో తాగునీరు అందని ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా ఎందుకు నీరివ్వలేదని కౌన్సిలర్ నేతల హరిబాబు, వారా పాప ప్రశ్నిస్తున్నారు.

ప్రజా సమస్యలపై వాడీవేడిగా చర్చ



కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న రాజశేఖర్

పెద్దాపురం: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సోమవారం వాడీవేడిగా జరిగింది. దీనికి చైర్‌పర్సన్ బొడ్డు తులసీ మంగతాయారు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ మాట్లాడుతూ ఆయా కమ్యూనిటీ ఫంక్షన్ హాళ్లలో జరిగే ఫంక్షన్లకు భారీ స్థాయిలో సొమ్ము వసూలు చేస్తున్నారని, తద్వారా మున్సిపాలిటీకి సైతం ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. మెయిన్‌రోడ్డులో షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే, అద్దెల రూపంలో మున్సిపాలిటీకి ఆదాయం సమకూరే అవకాశం ఉందన్నారు. విద్యుత్ చార్జీలు పెరిగిన నేపథ్యంలో ప్రభుత్వం తీసుకువచ్చిన సోలార్ సిస్టమ్‌ను తొలుత మున్సిపల్ భవనానికి, పార్కుల వద్ద వినియోగించే విధంగా చర్యలు చేపడితే ఖర్చులు తగ్గించుకోవచ్చని అన్నారు. దీనిపై కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి స్పందిస్తూ తప్పకుండా దృష్టి సారిస్తామన్నారు. కౌన్సిలర్ విడదాసరి రాజా మాట్లాడుతూ అమృత-2 ద్వారా స్థానిక మనోజ్‌చెరువు అభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. కౌన్సిలర్ త్సలికి సత్యభాస్కర్ మాట్లాడుతూ వర్షాకాలం నేపథ్యంలో పారిశుధ్య పనులను విస్తృతం చేయాలన్నారు. కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె కారణంగా పట్టణంలో మంచినీటి ఎద్దడి, వీధి దీపాల నిర్వహణ లేక ఇబ్బందులు తలెత్తుతున్నాయని అన్నారు. కౌన్సిలర్ గోకేడ అప్పారావు మాట్లాడుతూ పట్టణంలో మంచినీటి ఇబ్బందులు తీర్చాలన్నారు. కౌన్సిలర్ ఆకుల కృష్ణబాపూజీ మాట్లాడుతూ పట్టణంలో టిడ్కో లబ్ధిదారులకు గృహాలను అప్పగించడంలో నిర్లక్ష్యం తగదని, మిగిలిన లబ్ధిదారులకు ప్లాట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్మన్ బొడ్డు తులసీ మంగతాయారు, వైస్ చైర్మన్‌లు నెక్కంటి సాయిప్రసాద్, కనకాల మహాలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుత వర్షాకాలం, మరిడమ్మ జాతర నేపథ్యంలో పారిశుధ్య నిర్వహణ, మంచినీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అనంతరం పలు ప్రజా సమస్యలపై వాడీవేడిగా చర్చ సాగింది. నూతన కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన శ్రీకాంత్‌రెడ్డికి కౌన్సిలర్ రాజశేఖర్ ప్రజా సమస్యల పరిష్కారంపై వినతిపత్రం సమర్పించారు. మున్సిపల్ డీఈ ప్రకాశరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఆదినారాయణ, కౌన్సిలర్లు ఆరెళ్లి వీర్రాఘవులు, ముప్పన శ్యామలాంబ, పెంటకోట సత్తిబాబు, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యులు వాసంశెట్టి గంగ, షేక్ రఫీ తదితరులు పాల్గొన్నారు.

వచ్చారు.. వెళ్లారు



వీకే రాయపురంలో పడిపోయిన వరి చేనును ఏఓకు చూపిస్తున్న రైతులు

సామర్లకోట: వీకే రాయపురంలో ధాన్యం రాశులు తడిచి మొలకలు రావడం, వరి పంట నీటిలో నానడాన్ని వ్యవసాయ అధికారులు చూసి, వెళ్లారే తప్ప ఎటువంటి హామీ ఇవ్వలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. బంగాళాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఐదు రోజులు కురిసిన వర్షాలకు పంట పొలాల్లో ధాన్యం రాశులకు మొలకలు వచ్చాయి. ఏలేరు కాలువ అవతలి వైపు వీకే రాయపురం, బోయనపూడి గ్రామాలకు చెందిన సుమారు 40 ఎకరాల్లో వరి పంట కోతకు వచ్చిన దశలో ఈదురు గాలులు, వర్షాలకు చేలు పడిపోయాయి. దీనిపై 'సాక్షి' దినపత్రికలో వరుస కథనాలు రావడంతో ఏఓ సత్య సోమవారం వచ్చి పరిశీలించారు. వ్యవసాయాధికారి వచ్చి చూసి ఏమీ మాట్లాడకుండా వెళ్లిపోయారని రైతులు ఇంటి రమేష్, వెలమర్తి శ్రీనివాసు వాపోయారు. దీనిపై ఏఓ సత్యను వివరణ కోరగా మండల పరిధిలో మొలకలు, రంగు మారిన ధాన్యం సుమారు 200 మెట్రిక్ టన్నుల వరకూ ఉంటుందన్నారు. దీనిపై సివిల్ సప్లయిస్ డీఎం దృష్టికి తీసుకువెళ్లామన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు



విశ్రాంత ఉపాధ్యాయుడు, విద్యార్థులను సత్కరిస్తున్న దృశ్యం

కొత్తపల్లి: విద్యార్థులకు విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని విశ్రాంత ఉపాధ్యాయుడు అమ్ము వెంకటజోగయ్య శాస్త్రి అన్నారు. పాత ఇసుకపల్లిలో సోమవారం గొర్ల వెంకటరావు, మంగయ్యమ్మ మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తండ్రుల దినోత్సవం సందర్భంగా ఉత్తమ విశ్రాంత ఉపాధ్యాయుడు, పలువురు విద్యార్థులను సత్కరించారు. మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ గొర్ల పెద్దిరాజు, సునీత దంపతుల చేతుల మీదుగా పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన కోడూరి లలిత వెంకటసాయి, లావేటి గౌతమిలకు ఒక్కొక్కరికి రూ.వెయ్యి, 7వ తరగతిలో ప్రతిభ చాటిన చందక సాయికృష్ణకు రూ.500, మెమోంటో ఇచ్చి సత్కరించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు అమ్ము వెంకటజోగయ్యశాస్త్రిని సత్కరించారు.